క్లుప్తంగా

ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కామేశ్వరావు, ఉపాధ్యాయులు

మాడుగుల రూరల్: కేజేపురం జెడ్పీ హైస్కూలులో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. వద్దాదికి చెందిన అతిథి దేవోభవ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఇటీవల తల్లిదండ్రులు దినోత్సవం సందర్భంగా ఇక్కడ వివిధ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు శనివారం బహుమతులు అందజేశారు. ఈ నెల 26న నిర్వహించే మదర్ థెరిసా 114 జయంతిని పురస్కరించుకొని కరపత్రాలను సంస్థ కార్యదర్శి ఆరిపాక కామేశ్వరావు విడుదల చేశారు. హెచ్ఎం వి. దాసు, ఉపాధ్యాయులు సూర్రెడ్డి జగన్మోహన్, కె. అప్పన్నదొర, డి.బుల్లినాయుడు, జి. వెంకట్రావు, కె. ప్రసాదు పాల్గొన్నారు.

కొరుప్రోలు గ్రామానికి రోడ్డు ఏర్పాటుకు సర్వే



సర్వే చేస్తున్న సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ రామకృష్ణ

రోలుగుంట: గిరిజన గ్రామం కొరుప్రోలుకు రహదారి ఏర్పాటు కోసం పంచాయతీ రాజ్ సిబ్బంది శనివారం సర్వే ప్రారంభించారు. కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశాల మేరకు పీఆర్ జేఈ ఉమామహేశ్వరుడు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ రామకృష్ణ ఇక్కడ ప్రజలతో కలసి రోడ్డు ఏర్పాటుకు అనువుగా ఉండే స్థలాన్ని పరిశీలించారు. తమ దీర్ఘకాలిక సమస్య పరిష్కారానికి కృషి చేసిన సీపీఎం జిల్లా ప్రతినిధి కె.గోవింద, డీఆర్‌డీఏ పీడీ శచీదేవికి ఈ సందర్భంగా గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ రోడ్డు ఏర్పాటైతే తమ ప్రధాన సమస్య తీరుతుందని ఆనందం వ్యక్తం చేశారు.


బాల్య మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం



రాజు కుటుంబానికి నగదు అందజేస్తున్న స్నేహితులు

మాడుగుల రూరల్: తమ బాల్య మిత్రుడు కుటుంబానికి అతడి స్నేహితులు రూ.20 వేల సాయమందించి మానవత్వం చాటుకున్నారు. మాడుగులలో ప్రైవేటు ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న జవ్వాది రాజు గత నెల 30వ తేదీన మృతి చెందాడు. 1984–85 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన అతని స్నేహితులు వేమన గోవింద, భవిరిశెట్టి రవి, పుట్టా నానాజీ, తదితరులు శనివారం ఈ మొత్తం అందజేశారు.

ట్రిపుల్ ఐటీకి కేజీబీవీ విద్యార్థిని ఎంపిక



విద్యార్థిని హేమలత

రోలుగుంట: ఒంగోలు ట్రిపుల్ ఐటీకి స్థానిక కేజీబీవీ విద్యార్థిని బొట్టా హేమలత ఎంపికయింది. ఇక్కడ పాఠశాలలో క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించి పదో తరగతిలో అధిక మార్కులు తెచ్చుకుంది. రెండో విడతలో ట్రిపుల్ ఐటీ సీటు లభించింది. ఈ సందర్భంగా విద్యార్థినికి ప్రిన్సిపాల్ తులసి, ఉపాధ్యాయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

చిన్నారులకు టీకాలు

కె.కోటపాడు: 0–5 ఏళ్లలోపు చిన్నారులకు వ్యాక్సినేషన్‌ను తల్లిదండ్రులు తప్పకుండా చేయించాలని చౌడువాడ పీహెచ్‌సీ పీహెచ్ఎన్.కనకవేణి తెలిపారు. శనివారం గొండుపాలెంలో చిన్నారులకు వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. 11 మంది చిన్నారులకు వ్యాక్సిన్లు వేయడంతోపాటు ఆరుగురు గర్భిణులకు ధనుర్వాతం రాకుండా టీకాలు వేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం కుమారి, ఎంఎల్‌హెచ్‌పీ శశికళ పాల్గొన్నారు.

పండగ వాతావరణంలో వారోత్సవాలు

- ఐసీడీఎస్ పీడీ అనంతలక్ష్మి



నాతవరం: మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ అనంతలక్ష్మి

నాతవరం: జిల్లా వ్యాప్తంగా తల్లిపాల వారోత్సవాలు పండగ వాతావరణం తలపించేలా నిర్వహించి తల్లుల్లో చైతన్యం తీసుకురావడానికి కృషి చేస్తున్నామని ఐసీడీఎస్ పీడీ కె.అనంతలక్ష్మి తెలిపారు. గిరిజన గ్రామం సరుగుడులో శనివారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ర్యాలీ నిర్వహించారు. తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. సరుగుడు, సుందరకోట పంచాయతీల శివారు 16 గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాళ్లను సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలో 1,903 మెయిన్, మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయన్నారు. ఆయా కేంద్రాల పరిధిలో ఈ నెల 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు. 64 అంగన్‌వాడీ కేంద్రాలకు నూతన భవనాల నిర్మాణం కోసం గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. వాటిలో కొన్ని భవన నిర్మాణాలు పూర్తి చేయగా, 15 భవనాలు శ్లాబు దశలో ఉన్నాయన్నారు. కేంద్రాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. అనంతరం నర్సీపట్నం సీనియర్ సివిల్ జడ్జితో కలిసి పౌష్టికాహారం స్టాళ్లను పరిశీలించి కార్యకర్తలు, బాలింతలు, గర్భిణులతో సమావేశమయ్యారు. గొలుగొండ ఐసీడీఎస్ పీవో శ్రీగౌరీ, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



కె.కోటపాడు: డి.అగ్రహారంలో అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త వెంకటలక్ష్మి

తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష

మాడుగుల: తల్లి పాలే బిడ్డకు శ్రీరామరక్ష అని ఐసీడీఎస్ పీవో సీహెచ్ శ్రీదేవి అన్నారు. శనివారం మాడుగుల ప్రాజెక్టు పరిధిలో తల్లిపాల వారోత్సవాల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు తల్లి పాలే మొదటి టీకాగా పని చేస్తుందన్నారు. తల్లికి కూడా క్యాన్సర్ తదితర రోగాలు దరి చేరకుండా ఉంటుందన్నారు. అనంతరం మాడుగుల పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. సూపర్‌వైజర్ పి. చిన్నమ్ములు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు మేలు

గొలుగొండ: తల్లిపాలు తాగడం వల్ల పిల్లలకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని గొలుగొండ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ప్రసాద్ తెలిపారు. పప్పుశెట్టిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా వైద్యాధికారి శ్యామ్ ఆదేశాల మేరకు తల్లులతో సమావేశం నిర్వహించారు. తల్లి పాల గొప్పతనాన్ని వివరించారు. ప్రతీ గ్రామంలో వైద్య, అంగన్‌వాడీ సిబ్బంది తల్లిపాలు గొప్పతనాన్ని గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారన్నారు. జమ్మాదేవిపేట, నర్సింగబిల్లి, పప్పుశెట్టిపాలెం అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తల్లిపాలలోనే బిడ్డకు ఔషధ గుణాలు

కె.కోటపాడు: పుట్టిన చిన్నారులకు తల్లిపాలను అరగంట వ్యవధిలోనే అందించాలని అంగన్‌వాడీ కార్యకర్త వి.వెంకటలక్ష్మి తెలిపారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా డి.అగ్రహారం అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలకు, గర్భిణులకు ఆమె అవగాహన కల్పించారు. తల్లిపాలలో అధికంగా ఔషధ గుణాలు ఉండడం వల్ల బిడ్డకు వ్యాధినిరోధక శక్తి సమకూరుతుందని తెలిపారు. ఆర్నెల్ల వరకు బిడ్డకు తల్లిపాలను అందించాలన్నారు. తల్లిపాలే బిడ్డకు మొదటి వ్యాక్సిన్‌గా గుర్తించాలని తెలిపారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీని నిర్వహించారు. సర్పంచ్ వేచలపు గున్నమ్మ, మహిళా పోలీస్ కె.భావన, ఆయా రామలక్ష్మి, ఆశా కార్యకర్త పి.వి.లక్ష్మి పాల్గొన్నారు.

రోలుగుంట: మండలంలో తల్లిపాల వారోత్సవాలను మూడో రోజు శనివారం నిర్వహించారు. దీనిలో భాగంగా కొండపాలెంలో అంగన్‌వాడీ టీచర్లు నర్స, లక్ష్మి చిన్నారులు, వారి తల్లులతో గ్రామ వీధుల్లో ర్యాలీ చేశారు.



గొలుగొండ: తల్లిపాలు గొప్పతనాన్ని వివరిస్తున్న సిబ్బంది




రోలుగుంట: పెదపేటలో చిన్నారులు, తల్లులతో ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది



మాడుగుల: ర్యాలీలో మాట్లాడుతున్న సీడీపీవో శ్రీదేవి, సూపర్‌వైజర్ చినమ్ములు

నేడు కె.జె.పురంలో మోదమాంబ జాతర

- భారీ స్థాయిలో ఉత్సవ ఏర్పాట్లు
- విద్యుత్ దీపాలంకరణతో గ్రామం



ఆలయం నుంచి విద్యుత్ దీపాలంకరణ



ప్రత్యేక అలంకరణలో మోదమాంబ అమ్మవారు

మాడుగుల రూరల్: అమ్మలగన్న అమ్మ కె.జె.పురం మోదమాంబ జాతర ఆదివారం ఘనంగా నిర్వహించడానికి సర్వం సిద్ధమైంది. ఏటా ఆషాడ మాసం అమావాస్య సందర్భంగా ఈ జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. మాడుగుల సంస్థానధీశులు కాలంలో అమ్మవారి ఆలయాన్ని నిర్మించారు. అప్పటి మాడుగులను పాలించే రాజు వడ్డాది జగన్నాథ భూపతి దేవ్ వర్మ పేరు మీద కస్పా జగన్నాథపురం అనే పేరు వచ్చిందని ప్రతీతి. గ్రామానికి చెందిన ఆడారి మోదినాయుడు కుటుంబీకులు మొదట సారిగా పసుపు కుంకుమలు సమర్పిస్తారు. జాతర సందర్భంగా ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేసినట్లు గ్రామ సర్పంచ్ జామి రమణబాబు, ఉత్సవ కమిటీ చైర్మన్ భీశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. గ్రామ పురవీధుల్లో విద్యుత్ దీపాలంకరణ ఏర్పాటు చేశారు. ఆలయం వద్ద దాతలు సహకారంతో ఉచిత ప్రసాద వితరణ, మజ్జిగ పంపిణీ చేయనున్నారు. జాతర సందర్భంగా గ్రామంలో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టామన్నారు.

సాంస్కృతిక కార్యక్రమాలు.. జాతర సందర్భంగా పలు సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. గ్రామ ప్రధాన కళావేదిక మీద(వీధిలో) డ్యాన్సు బేబీ డ్యాన్సు, శాలిపేట వద్ద సంగీత విభావరి, గణేష్ షాపు వద్ద సబ్బవరం వారి బుర్రకథ, హైస్కూలు వద్ద రేలా రే రేలా, అచ్చియ్య గారి షాపు వద్ద సినీ డూప్స్ ప్రోగ్రామ్, కె.జె.పురం జంక్షన్ వద్ద డ్యాన్సు బేబీ డ్యాన్సు (హైదరాబాద్ డీ విన్నర్స్ కాంబినేషన్‌లో) గాంధీ వీధిలో బుర్రకథ ప్రదర్శించనున్నారు. మధ్యాహ్నం నాలుగు గంటలు నుంచి నేల డ్యాన్స్, తీన్‌మార్ డప్పులు, కాళీ మాత వేషాలు, చిటికెలు, తప్పెటగుళ్లు, భారీ మందుగుండు సామగ్రితో జాతర అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ వారు పేర్కొన్నారు.

నేడు క్రికెట్ టోర్నమెంట్

గ్రామంలో ఆదివారం క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు స్థానిక యూత్ సభ్యులు తెలిపారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.3 వేలు, రూ.2 వేలు, రూ.వెయ్యి చొప్పున్న అందజేస్తామన్నారు.

అవయవ దానంతో పునర్జన్మ



అవయవాల చిత్రాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

మాకవరపాలెం: అవయవ దానంతో ఎందరికో పునర్జన్మ ఇవ్వొచ్చని హెచ్ఎం కె.రాము తెలిపారు. తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో దేశ అవయవ దాన దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గుండె, ఊపిరితిత్తులు, కంటిలోని కార్నియా, గుండె కవాటాలు, చర్మం, ప్రేగులు, రక్తనాళాలు, జీర్ణాశయంతోపాటు మరి కొన్ని అవయవాల చిత్రాలను ప్రదర్శించారు. వాటిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అవయవ దానం చేసేందుకు ముందుకు రావాలన్నారు. ఉపాధ్యాయులు లోవరాజు, నారాయణరావు, సంతోషి పాల్గొన్నారు.

మహిళ ఆచూకీ కోసం పోలీస్ స్టేషన్ వద్ద నిరసన



పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న మహిళా బంధువులు, గ్రామపెద్దలు

రాంబిల్లి (యలమంచిలి): అదృశ్యమైన మహిళ ఆచూకీ కనుగొనడంలో పోలీసులు నిర్లక్ష్యం చూపుతున్నారంటూ రాంబిల్లి పోలీస్ స్టేషన్ వద్ద ఆ మహిళ బంధువులు శనివారం నిరసన వ్యక్తం చేశారు. రాంబిల్లి మండలం లాలం కోడూరు శివారు పెదయాతపాలెం గ్రామానికి చెందిన కొల్లి అపర్ణ కొన్ని నెలల క్రితం అచ్యుతాపురంలోని ఓ ప్రైవేట్ బ్యాంకులో బంగారు లోన్ వడ్డీ కట్టడానికి వెళ్లి తిరిగి ఇంటికి తిరిగి చేరుకోలేదు. దీంతో రాంబిల్లి పోలీస్ స్టేషన్‌లో ఆమె భర్త అప్పలనాయుడు ఫిర్యాదు చేశాడు. అదృశ్యమైన మహిళ ఆచూకీ కోసం కొన్ని నెలలు నుంచి పోలీసులను ప్రశ్నిస్తున్నా సరైన సమాధానం చెప్పడం లేదని బంధువులు ఆరోపించారు. దీనికి నిరసనగా కులసంఘం పెద్దలతో కలిసి వారు నిరసన వ్యక్తం చేశారు. సీఐ నర్సింగరావు మాట్లాడుతూ త్వరలోనే ఆచూకీ కనుగొంటామని తెలిపారు.

రిటైర్డ్ ఎంఈవో జయలక్ష్మి ఆదర్శం



జయలక్ష్మి దంపతులను సన్మానిస్తున్న సంఘ నేతలు

చీడికాడ: మండల విద్యా శాఖాధికారిగా విధులు నిర్వహించి ఉపాధ్యాయులకు ఎనలేని సేవలందించిన రిటైర్డ్ ఎంఈవో జయలక్ష్మిని ఆదర్శంగా తీసుకోవాలని ఏపీటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు జీపీఏ నాయుడు తెలిపారు. శనివారం చీడికాడలో జయలక్ష్మి దంపతులను దుశ్శాలువాలతో సత్కరించారు. ఆయన మాట్లాడుతూ చీడికాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎంగా, ఎంఈవోగా జయలక్ష్మి విధులు నిర్వహించి ఇటు విద్యార్థులకు, అటు ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలిచారన్నారు.

పేట డైవర్షన్ రోడ్డుపై నుంచి ట్రాక్టర్ బోల్తా



పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడిన ట్రాక్టర్

బుచ్చెయ్యపేట: విజయరామరాజుపేట డైవర్షన్ రోడ్డుపై నుంచి పొలాల్లోకి ట్రాక్టర్ దూసుకెళ్లి బోల్తా పడింది. శనివారం పెట్రోల్ బంక్ నుంచి పొలాల్లో దమ్ముకు వెళ్తుండగా డైవర్షన్ రోడ్డు గోతుల్లో పడి అదుపు తప్పి ఈ ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి దూకేసి ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాడు. ఆ సమయంలో వాహనదారులు అటువైపు వెళ్లకపోవడంతో ప్రమాదం తప్పింది. డైవర్షన్ రోడ్డులో గోతులను పూడ్చాలని పలువురు కోరుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నేడు ఏఎల్‌పురంలో మరిడిమాంబ జాతర



గొలుగొండ: ఏఎల్‌పురంలో గ్రామస్తుల ఇలవేల్పు మరిడిమాంబ జాతర ఆదివారం ఘనంగా నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు సభ్యులు తెలిపారు. పండగ సందర్భంగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే భారీ విద్యుత్ అలంకరణ ఏర్పాట్లు, అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు.

గంజాయితో ముగ్గురి అరెస్టు



గంజాయితో పోలీసులకు పట్టుబడిన నిందితులు

రోలుగుంట: మండలంలోని ఎం.కె.పట్నం శివారు చటర్జీపురం రూట్‌లో శనివారం బైక్‌లపై వెళుతున్న ముగ్గురిని అరెస్టు చేసి, వారి నుంచి నాలుగున్నర కిలోల గంజాయి, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు. కోటవురట్ల మండలం ఎండపల్లి గ్రామానికి చెందిన ఇద్దరితో పాటు గంజాయి విక్రయించిన కొయ్యూరు మండలానికి మహిళను అరెస్టు చేసి, రిమాండ్ తరలించామని ఎస్ఐ చెప్పారు.

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలి

మాడుగుల ఎంపీపీ రాజారామ్



ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలతో ఎంపీపీ రాజారామ్ తదితరులు

మాడుగుల: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి బొత్స సత్యనారాయణ గెలుపే లక్ష్యంగా పని చేయాలని ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ తెలిపారు. శనివారం దొర్లసురవరం గ్రామంలో వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు, నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సారథ్యంలో మండలంలో పార్టీ ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు ఐకమత్యంతో పని చేసి, తమ అధినేత మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బలపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థి బొత్సను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. త్వరలో జరగనున్న పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ల ఎన్నికలో పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. నాయకులకు, కార్యకర్తలకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు నాయకత్వంలో సైనికునిల్లా పని చేస్తామని ఈ సందర్భంగా ఎంపీటీసీలు, నాయకులు స్పష్టం చేశారు. జెడ్పీటీసీ కిముడు రమణమ్మ, మాజీ ఎంపీపీ వేమవరపు రామధర్మజ, వైస్ ఎంపీపీ కొత్తపల్లి శ్రీనువాస్, పట్టణాధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనువాసరావు మాట్లాడారు. వైఎస్సార్ సీపీని నమ్ముకున్న వారికి రానున్న కాలంలో మంచి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మాడుగుల సర్పంచ్ ఎడ్ల కళావతి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పీఏసీఎస్ మాజీ పర్సన్ ఇన్‌చార్జులు పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో మెలగండి

చోడవరం సీఐ శ్రీనివాసరావు

చోడవరం రూరల్: సత్ప్రవర్తనను అలవరచుకుంటే చీటికీమాటికీ పోలీసులు పిలిపించుకునే అగత్యం రాదని రౌడీషీటర్లు, అనుమానితులకు చోడవరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాసరావు హితవు పలికారు. శనివారం పోలీస్ సర్కిల్ కార్యాలయానికి చోడవరం స్టేషన్ పరిధిలో నమోదైన రౌడీషీటర్లు, అనుమానాస్పద చరితులను పిలిపించుకుని వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. మంచి ప్రవర్తనను కనబరిచినట్టయితే వారిపై నమోదైన రౌడీషీట్లు, సస్పెక్ట్ షీట్లను ఎత్తివేస్తామని హామీనిచ్చారు. అనవసర గొడవలు, సంఘటనలలో తమ జోక్యాన్ని తగ్గించుకోవాలన్నారు. ఎవరితోను ఎటువంటి వాదనలు, ఘర్షణలకు పాల్పడకుండా చట్టపరమైన వృత్తి, వ్యాపార, పనుల ద్వారా తమ ఆదాయ వనరులను మెరుగుపరచుకోవాలన్నారు. అవకాశం ఉన్నంత వరకు పోలీసు వారికి సహకరించాలని, లేనిపక్షంలో ఏదైనా అనుమానిత ఘటన జరిగినపుడు ఎన్నికలు, భారీ ప్రదర్శనలు, సమావేశాలు, జాతరలు వంటివి జరిగిన సమయంలో తప్పనిసరిగా పోలీసులు ఆధీనంలోకి రావాల్సి ఉంటుందని హెచ్చరించారు. వీటన్నింటికీ దూరంగా ఉండాలంటే, మంచిగా మసలుకోవాలని, క్షణికావేశాలకు లోను గాకుండా, నేరచరితకు దూరంగా ఉండాలని సూచించారు.

మహనీయుల అడుగు జాడల్లో నడుచుకోవాలి

రిటైర్డ్ జడ్జి సన్యాసిరావు



వడ్డాదిలో విద్యార్థులకు దుప్పట్లు అందిస్తున్న రిటైర్డ్ జడ్జి సన్యాసిరావు

బుచ్చెయ్యపేట: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి మహనీయుల అడుగుజాడల్లో నుడుచుకోవాలని రిటైర్డ్ జడ్జి, చోడవరం అంబేడ్కర్ ట్రస్టు చైర్మన్ నడుపూరి సన్యాసిరావు తెలిపారు. శనివారం సాయంత్రం వడ్డాది ఎస్సీ వసతి గృహంలో 107 మంది విద్యార్థులకు అంబేడ్కర్ ట్రస్ట్ తరపున దుప్పట్లు పంపిణీ చేశారు. ప్రతి విద్యార్థి ఉన్నత చదువులపై దృష్టి సారించాన్నారు. తల్లిదండ్రులు కలలను సాకారం చేసి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. పలువురు విద్యార్థులను ప్రశ్నలడిగి సమాధానాలు బాగా చెప్పిన మాదల నూకరాజు, నేమాల హరి ప్రసాద్‌లకు ప్రోత్సాహకాలు అందించారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మెరిట్ సాధించిన విద్యార్థులకు అంబేడ్కర్ ట్రస్ట్ తరపున స్కాలర్‌షిప్‌లు అందిస్తామన్నారు. రిటైర్డ్ ఏఎస్పీ పి. ప్రకాష్‌రావు, అంబేడ్కర్ ట్రస్ట్ సభ్యులు డి. సుందరరావు, కండెల్లి వెంకటరావు, జె. అప్పారావు, పి.పైడిరావు, ఎస్. బెనర్జీ, వార్డెన్ రమణ పాల్గొన్నారు.

కోనాంలో వీధి కుక్కల స్వైరవిహారం

వృద్ధురాలికి గాయాలు



చీడికాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధురాలు పార్వతి

చీడికాడ: కోనాంలో వీధి కుక్కల స్వైరవిహారంతో జనాలు హడలిపోతున్నారు. చిన్నాపెద్ద అని తేడా లేకుండా దాడికి పాల్పడుతున్నాయి. వారం రోజుల క్రితం ఇద్దరు కుక్క కాట్లకు గురైతే వారిని చోడవరం ప్రభుత్వాస్పత్రికి తరలించాల్సి వచ్చింది. ప్రతి సాయంత్రం కుక్కల బెడద అధికంగా ఉంటుందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శనివారం గ్రామానికి చెందిన వృద్ధురాలు పార్వతిపై కుక్కలు ఒక్కసారిగా దాడి చేసి గాయపరిచాయి. ఆమె కుటుంబ సభ్యులు చీడికాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీధి కుక్కల బెడదను తొలగించాలని కోరుతున్నారు.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పు హర్షదాయకం



ఎమ్మార్పీఎస్ నాయకులు ఎలుసూరి ఘాటీలు, శ్రీనువాసరావు తదితరులు

చోడవరం: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు తీర్పు చెప్పడం హర్షనీయమని రాష్ట్ర రెల్లి కుల సంక్షేమ సంఘం కార్యదర్శి బంగారు వెంకటేశ్వరరావు, రాష్ట్ర రెల్లి కుల హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు యర్రంశెట్టి పాపారావు తెలిపారు. స్థానిక అంబేడ్కర్ భవనంలో శనివారం వారు మాట్లాడుతూ వర్గీకరణ కోసం మందకృష్ణ మాదిగ అలుపెరుగని పోరాటం చేశారని, ఆయన కృషి వల్లే సాధ్యమైందన్నారు. కోర్టు కూడా పేదల పక్షాన నిలిచిందని ఈ సందర్భంగా వారు కొనియాడారు. మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. చోడవరం సర్పంచ్ బండి నూకాలమ్మ శ్రీను, యర్రంశెట్టి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల: ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణకు సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు హర్షనీయమని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎలుసూరి ఘాటీలు తెలిపారు. శనివారం ఒమ్మలిలో ఎమ్మార్పీఎస్ మండల సీనియర్ నాయకుడు ఎలకా శ్రీనువాసరావు అధ్యక్షతన నిర్వహించిన విజయోత్సవ కార్యక్రమంలో ఘాటీలు మాట్లాడారు. మందకృష్ణ మాదిగ పోరాట ఫలితంగా ఉపకులాలకు రిజర్వేషన్ ఫలాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. ముందుగా బీఆర్ అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలతోపాటు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకాలు చేశారు. ఎమ్మార్పీఎస్ నాయకులు చెవ్వేటి నరసింగరావు, ఎం. అప్పారావు, ఎలకా జానీ, రావాడ ఈశ్వరరావు, ఎలకా కొండమ్మ, ఎలకా రాజేష్ పాల్గొన్నారు.

వీఆర్ఏల సమస్యలను పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న వీఆర్ఏలు

బుచ్చెయ్యపేట: తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని బుచ్చెయ్యపేటలో వీఆర్ఏలు ధర్నాకు దిగారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట వీరంతా తమ డిమాండ్లను పరిష్కరించాలని నినాదాలు చేశారు. నెలకు రూ.26 వేలు పే స్కేల్ అందించాలని, నైట్ డ్యూటీలు వేయొద్దని, నామినీ వీఆర్ఏలను రెగ్యులర్ చేయాలని, తహసీల్దార్ కార్యాలయం దగ్గర డ్యూటీలు వేయకుండా అటెండర్, వాచ్‌మెన్ ఉద్యోగులుగా విధుల్లోకి తీసుకోవాలని, అర్హతవున్న వారిని వీఆర్వోలుగా పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు.